ఆడబ్రతుకు

జె. శ్రీనివాసరావు

సీతకు నవ్వొచ్చింది! ఎందుకో తెలీదు. సరిగ్గా జ్ఞాపకం లేదుగానీ సీత నవ్వి ఆరేడు సంవత్సరాలు పైనే అవ్వచ్చు.

సీత వంటరి గుడిసెలో కుక్కి మంచ మ్మీద అస్తవ్యస్తంగా పడుకుని ఆలోచిస్తున్నప్పుడు సీతకు నవ్వొచ్చింది. సీత నవ్వు అపశకునంగా తోచిందేమో ప్రకృతికి కూడా! విశ్వతంగా దూరంలో నక్కలు వేసే వూళలూ, కీచురాళ్ళ గోలలు దానికి తోడైయ్యాయా అన్నట్టు ఆలోచిస్తూ ఆకాశం కూడా మేఘాలతో నిండుకుంది. నిండుకుండని రాయితో కొడితే వరదొచ్చినట్టు తయారైంది!

"సుగుణ నిజంగానే చెప్పిందా?" లేక తనకేమైనా కలొచ్చిందా? అనుకుంది సీత! సుగుణ దగ్గరకి వరంగల్లు వెళ్ళాక అక్కడ మామూలు జీవితం గడపబోతందాతను? సరిగ్గా ఇక్కడే ఈ ఆలోచన దగ్గరే సీత నవ్వింది.

"పేసింజరు" చేతిల్లో కుక్కిన పది రూపాయిలు విడదీసి జాకెట్టులో తోసి చీర సర్దుకుని మంచమ్మీద కూర్చొని తిరిగి పునరాలోచనలోకి వెళ్ళింది సీత.

అప్పెప్పుడో సీతారాంపురం కాలేజీలో ఇంటర్మీడియట్ సుగుణతో పాటు చదివింది సీత. సుగుణ అసలు అంత చీకటిలోనూ గుర్తించడం చాలా ఆశ్చర్యకరం! అసలు అంతా విచిత్రంగా వుంది.

గుడిసెకు దూరంగా బస్సు పొడవడమేమిటి? బస్సు దగ్గరికి తన పేసింజర్లని వెతకటానికి తను వెళ్ళడమేమిటి? ఏనాడు తను పేసింజర్ల కోసం వెతకలేదు. గత వారం నుండీ ఈ బాధ ఎక్కువైంది. అసలు ఏ లారీ వాడు మునపల్లాదర్జాగా పాకముందు ఆపటం లేదు. కొత్తగా ఎవడో కుర్రాడిక్కడికి ఎస్సై ఉద్యోగంపై రావడంనుండే ఈ సజ్జు మొదలైంది. రెండు మూడుసార్లు ఇక్కడకు కూడా వచ్చి వార్నింగిచ్చాడు. ముందు అందరూ అలాగే కనపడతార్లే అని సర్దుకుంది. కానేం సుఖం! వదలకుంటున్నాడు!

వారంకి మూడుసార్లైనా కొంపలు వెతుకుతాడు. అసలు తన అదృష్టమో, అతగాడి దురదృష్టమో! వచ్చినప్పుడు, ఏ, పేసింజరూ గుడిసెలో దొరక్కపోవడంతో కుడితిలో పడ్డ ఎలకలా కొట్టుకునిపోయాడు. అసలతనలా తిరగడానికి కారణం కూడా పాకజనం కనిపెట్టారు. ఆ కుర్రాడు కష్టపడి పైకొచ్చాడన్నది మొదటి కారణమైతే, అతగాడి తండ్రి ముండల మూకొర్రై తల్లిని, పిల్లాడిని చిన్నప్పట్నుంచి నిర్లక్ష్యం చెయ్యడం అసలు కారణంట! అసలీ వేపారమే తమ జీవితం నాశం చేసిందని కత్తికట్టేడు. అంచేత అందర్లా మందుకీ లొంగలేదు. మామూలుకీ లొంగలేదు!

ఆడదాని గాలి పరేసరి! అదంటే మండి పడుతున్నాడు. ఇంకా పెళ్ళి కూడా అవలేదని అప్పుడెప్పుడో ఖాతాదారుడైన ఆ "ముసలి ఏడ్డు" కూడా ఓ రాత్రి పక్కలో సరస మాడుతూ అన్నాడు. ఈడి బాధపడలేకే నేమో పెద్ద రోడ్డు పక్క పాకలు శానా మటుకు ఖాళీ అయిపోయి మట్టికొట్టుకు పోనాది బిజినెస్సు! శానా "సిలకలు" నెల్లూరి సైడు గూడు కోసం ఎక్స్ప్రెస్సు లారీల్లో ఎగిరిపోనాయి అంది "ఎర్ర సింతాలు". వారంకి ఎంతలేదన్నా పదిమంది పేసింజర్లూ పది పదులు సుఖం కొనుక్కునే వారు. కానీ అదేం సిత్రమో! వారంకి ఇద్దరు కూడా ఆగటం కష్టమైపోనాది గుడిసెముందు. ఆ ఎస్సైగాడికి భయపడే!

సదువుకున్న సదువు ఎప్పుడో బుర్రలోంచి సెరిపేసింది సీత! అదే నిన్న రాత్రి సుగుణ అంది. అసలు సుగుణ కనపడి కేకేస్తే తుళ్ళిపడిందితను! మొగాడు పిలడం ఆడది తిట్టడం తెలుసుగానీ, ఆడది పిలడం అలా మాట్లాడటం జరిగి చాలా రోజులైంది. ఎప్పుడైనా ఈ మధ్య మాట్లాడితే "ఎర్ర సింతాలు", "నెల్లూరివారి" మాత్రం తనతో మాట్లాడేవారు! అదీ పూర్తిగా బేరాల సంగతి. ఎప్పుడూ బెంగాలీ వోడు ఇవ్వని డబ్బు కోసం, పంజాబోడు పెట్టిన బాధల కోసం, "సిన్న బళ్ళ" మీదొచ్చిన గుంటల సరదా బేరం! ఇదే! తమ మధ్య మాటలు! ఎప్పుడైనా!

సుగుణకు తను చేస్తున్నపని దాపరికం లేకుండా రెండో మాటగానే చెప్పేసింది. ఏదో మెచ్చుకుంటుందని కాదు. నోర్మూసుకుని మొఖం తిప్పకుంటుందని! అలాటి వెనక జీవితాల్ని ఎప్పుడో చెరిపేసింది. కాని ఆశ్చర్యం! సుగుణ ఆ మాటకు తొణకలేదు! బెణకలేదు! పైపెచ్చు అదేదో మామ్మూలి విషయంలా గతం తవ్వింది. ముందు తనకీ అనుమానమొచ్చింది. కొంపదీసి సుగుణ కూడా తన లాగే ఏ బీహారులోనో మంచి జోరులో వున్న ఈ వ్యాపారం కాదుకదా అన్న అనుమానం! తర్వాత పాపం సుగుణ. పవిత్ర జీవితం తెలుసుకున్నాక సిగ్గనిపించింది.

సుగుణ భర్త మంచివాడు! సారా కాంట్రాక్టరైతేనేం, చెప్పుల కాంట్రాక్టరైతేనేం రెండు చేతులా సంపాదిస్తాడు. రెండు కళ్ళతో పెళ్ళాంపిల్లల్ని చూసుకుంటాడు. కుమార్‌లా కాదు. ఛీ! ఛీ! ఆ త్రాష్టుడి పేరేంటి ప్రతిరోజూ ఎంత మర్చిపోదామన్నా జ్ఞప్తిలోకి దొర్లుతుంది?

అవును! తన జీవితం సర్వనాశం కావడానికైన కారకుడి పేరు తనెలా మర్చిపోతుంది. ఇంటరు చదివేటప్పుడు తనమాట్లాడే ఆదర్శ ఉపన్యాసాలు ఒక విధంగా తనకు శత్రువైయ్యాయి. హాయిగా కుమారిలాగో, సుగుణలాగో, సుందరిలాగో తలొంచుకుని పుస్తకాల అట్టలు సరిచేసుకుంటూ పాఠాలు వింటున్నట్టు నటిస్తూ, తమ తమ అందాలను గురించి చుట్టూ తిరిగే అబ్బాయిల మనోగతాల గురించి గోడ కట్టుకుని భయపడుతూ ఆలోచించుకుని, తల్లితండ్రులు చూపించిన మొగాడి ముందు తలొంచుకు తాళి కట్టించుకుంటే!? ఆ పరిస్థితే మేలు! హాయిగా మనస్సులో ఒకరితో కోరిక, మనుషుల్తో ఒకలా వేదిక! అవకాశం కోసం చూస్తున్న అస్థి పంజరంలా! ఆ దారే బావుంటుందేమో!

తను మాట్లాడే ఉపన్యాసాల వెనక చప్పట్ల మధ్య ప్రతి రెండు చేతుల మధ్య ఆ స్వార్థాలుంటాయని ఊహించలేని తన వెర్రి అమాయకత్వం, ధైర్యం చేసిన కుమార్‌తో స్వచ్ఛతతో మాటలు మొదలయ్యాయి. ఎందుకో ఊరిజనమేకాదు, కాలేజీ జనం కూడా, భయపడో, బాధపడో, అసూయపడో బజారు కీడ్చారు. తల్లి చాటున పిల్ల అయినా ధైర్యంగా ఎదుర్కొంది. తండ్రి లేకపోయినా వాటి నన్నిటికీ ఎదురీంది. కుమార్ చేసుకుంటానన్న ఆదర్శ వివాహానికీ, కట్న రహిత సంబంధాలకూ తానే నాంది అవుతుందని మురిసిపోయింది!

చివరిఘడియలో తండ్రి ఎమ్మెల్యే పదవిని చూసో, వెనకున్న దుర్బుద్ధి చూసో ధైర్య ద్వారాలు మూసేసి మద్రాసు పారిపోదామన్నాడు కుమార్! చివరకు కుమార్ కూడా అలా భయపడటంతో విధిలేక "కొన్నాళ్ళే" కదా అని కుమార్ వెంట మద్రాస్ ఊగొదిలి వచ్చింది పరీక్షలయ్యాక!

ఉపాధి తర్వాతే పెళ్ళని, ఎంత కట్టుదిట్టించినా వయసు మోహం ఇదిర్నీ కమ్మేసి, తినడానికి సరియైన తిండిలేకపోయినా పిల్లదు కడుపులో ఆర్నెల్లు అయ్యేసరికి కదలడం మొదలు పెట్టాడు. అది చూసో, లేక దొంగతనంగా తెచ్చిన డబ్బుచూసో కుమార్ చెప్పా పెయ్యకుండా ఓ రాత్రి పారిపోయాడు.

వెర్రిదాన్లా చూసి, చూసి ఉన్న ఊర్లోకి రహస్యంగా సుగుణకే రాసింది; కుమార్ సంగతి అప్పట్లో.

సుగుణ జవాబుచూసి ఏడవాలో, నవ్వాలో అర్థంగాక నవ్వింది. అదిగో సరిగ్గా అప్పుడు అంటే సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం కామోసు నవ్వింది. ఆ తర్వాత ఎంత నవ్వుదామన్నా పక్కన ఎదుగుతున్న గుంటడ్నిచూసో, లారీ రంగస్వామి చూపించిన విధిలేని దారి చూసో ఏడుపువచ్చేది. కానీ ఎప్పుడూ ఏడ్వలేదు! అది వేరే సంగతి!

కుమార్‌కి తన ఉత్తరం సంగతి సుగుణ చెప్పాక కుమార్ ఆలోచన్లు సుగుణకు రాసేసింది. కుమార్ రడీగా అప్పటికే ఒక చేత్తో పోలీసు కేసు, రెండో చేత్తో తండ్రి రాజకీయంతో ఊర్లో తిరుగుతున్నాడు. తన మాటలు నమ్మి కుమార్ దొంగతనంగా ఇంట్లోంచి తెచ్చిన యాభైవేలు నగలు మద్రాసులో కాజేసి లారీ రంగయ్యతో లారీ కొనిపించిందని అప్పుడే అల్లేశాడు. అసలు వాడికింత తెలివేది? వాడిబాబు ఇంకా ఎంత వెనకుంచేడో! జనం వెర్రి వెధవలు. అద్దంలో నుండి కన్పిస్తున్న తన బొమ్మ నాదిలి రెండో వైపు చూద్దామన్నంత ఉత్సాహం, నమ్మకం ఉన్న వెర్రి వెధవలు.

లారీ రంగయ్య ఎంతో బోధపర్చేడు. వాడు ఏదో మోసం చేస్తున్నాడేమో నని అనుమానం పడింది ముందు. వాడిమాటలు పడక మద్రాసులో చెయ్యని పనిలేదు "ఇటువంటి వ్యాపారం" తప్ప. ఎక్కడ ఏ పనీ స్థిరంగా చెయ్యనివ్వలేదెవడూ! అప్పుడు ఒంటరి ఆడదాని నుండి ప్రతీ మొగ వెధవకీ ఈ కాలంలో కావల్సిందేమిటో, దేనికోసం ఎలాంటి దొంగ వేషాలేస్తాడో కొంచెం కొంచెం అర్థం అవసాగేయి. విరక్తి పుట్టింది. ముళ్ళ కంచెల మీదపడి ముళ్ళుగుచ్చుకోకుండా వుండేందుకు చేసిన పోరాటంలో రానురాను అశక్తురాలౌతోంది.

అప్పుడు గ్రహించింది సరిగ్గా! ముళ్ళ కంచెనే పాన్పుగా చేసుకుంటే ఇంక ముళ్ళు గుచ్చుకుంటాయన్న బాధగానీ, అదొక ముళ్ళ కంచెన్న భావనగానీ రాదని. మరొకటి గూడా గ్రహించింది.

అన్ని వ్యసనాలూ వున్న లారీ రంగయ్య తనని కావాలని మోసగించ లేకపోవటం! అందుకే లారీ రంగయ్య మాటలు మరోసారి ఆలోచించి విధిలేక ఈ వీధికి వచ్చింది.

దొంగింట్లోనే మనం మంచం వేస్తే దొంగతనం జరగమన్నా జరగదు! లారీ రంగయ్య ఎంతైనా మంచివాడు. లారీ రంగయ్య ప్రతి రెండో వారం నెలలో ఒకసారి వస్తాడు. అదీ గుంటడి క్షేమ సమాచారాలతో. పుట్టిన కుమార్ ప్రతి రూపానికి పేరేం పెట్టిని రాంబాబుని ముద్దుగా లారీ రంగయ్యే చూసుకుంటున్నాడు.

జాడ తెలియని తండ్రి విషయం, జాడ తెలిసినా తల్లివని చెప్పకుంటే ఎక్కడ వెధవ పసిమనస్సు బాధపడ్తుందోనని, అసలీ బాధలే లేకుండా లారీ రంగయ్య వాణ్ణి సాకడం వల్లే ఆ మాత్రమైనా బతక గల్గులోంది.

రంగయ్య సాయంతో సుగుణ చెప్పిన వరంగల్లు వెళ్తే ఇకనైనా ఈ దరిద్రపు వ్యాపారాన్ని చెరిపేసి సుగుణ నీడలో ఉన్న జీవితం రాంబాబు గాడితో గడపొచ్చు. సంఘానికి ధైర్యంగా ఎదురీదొచ్చు! అసలీ ఆలోచన ఎందుకో నవ్వు తెప్పిస్తోంది. చూద్దాం రంగయ్య ఏ ఉపకారం ఇందులో చేస్తాడో!

బుడ్డీ ఆర్పేసి రాని నిద్రకై ఉపక్రమించింది సీత.

* * *

"రేపే నేను వరంగల్లు వెళ్తున్నామలోడుతో! ఆఖరి నిర్ణయం ఆ జీవితానికే నిర్ణయించుకుంటే రడీకా" అన్న మాటలకు రడీగా వుంది. వున్న కుక్కి మంచాలు, మట్టి కుండలు, పాకను కనిపెట్టుకుని వున్న "రిక్షా జీడి" గాడికి వదిలేసింది. వున్న నాలుగు చీరలు, చినిగిన పది జాకట్లు పాత ట్రంకు పెట్టిలో పెట్టుకుని తయారైంది. నాసిరకం సెంటు బడ్డీలు, పెదాల రంగు, గోళ్ళ రంగు మొదలైనవన్నీ చెరువు గట్టువైపు విసిరేసింది.

"నువ్వన్నావు కానీ వస్తావని నేనేనాడు వూహించలేదు సుమా!" అన్న సుగుణ ఆనందపు మాటలు సీతకు ఇల్లు వెతుక్కున్న కష్టాలను దూరం చేసి మాయం అయ్యాయి. సుగుణ ఆదరణ సీతకు మరువరానిది.

సుగుణ మొగుడు కాంట్రాక్టు పన్లమీద బెజవాడ వెళ్ళి ఆర్రోజులైందిట. ఇంకా పది రోజులపైనే పడుతుందిట వచ్చేసరికి. కబుర్లయ్యే సరికి రాత్రి ఎంతయిందో తెలీదు. ముందు గదిలో సీతకు పక్కవేసింది సుగుణ. సుగుణ జీవితం సీతకు ఎంతగానో నచ్చింది. ఇంత హాయిగా కాకపోయినా ఇంకా కొంతలో కొంత సమాజంలో తిరగగలదు. సుగుణ కుటుంబం నీడలో! ఆ మాత్రం సాయం చాలు సీతకు.

అర్థరాత్రి దాటినా సీతకు గదిలో నిద్ర రాలేదు. మునుపైతే అసలు నిద్రకు రాత్రికీ సంబంధం ఉండేదికాదు. పగలంతా నిద్ర, రాత్రంతా పగలూ! ఒకవేళ కునుకు పడినా ఏ అర్థరాత్రో టక్కుమని తలుపు చప్పుడైతే గప్పున లేచేది. ఉపాధి అది! జీవితం అది! అక్కడ మత్తుపడితే బతకలేదు. అయితే ఇక్కడ వేరు!

ఇక్కడ కొత్తచోటని కూడా నిద్రకు లేదు. రేపట్నించి ఈ పట్నంలో జనం మధ్య తన బతుకు గురించి ఆలోచన్లు నిద్రను దూరం చేస్తున్నాయి. సుగుణకు ముందే చెప్పింది. పాత సంగతులు ఆ పాకతోనే సమాధి చేసింది. మూడో కంటికి పాక సంగతి తెలియకూడదని కూడా ప్రమాణం తీసుకున్నాకే వరంగల్లు వచ్చింది.

మాగన్నుగా నిద్ర పడుతోందో, భ్రమో తెలియదు కానీ ఎవరో తలుపుతీసి సుగుణ వున్న గదిలోకి వెళ్ళటం కనిపడింది. నిద్ర వదుల్చుకుని, "ఈ రాత్రి సుగుణ భర్త వచ్చేసాడా" అని ఆశ్చర్యపోయింది. చూస్తుండగానే సుగుణ గదిలోనుండి మాటలు అస్పష్టంగా వినిపించాయి. భర్తతో సుగుణ బహుశా మొదలుపెట్టే సంభాషణ నిశ్చయంగా తనగురించే! ఉత్సుకత అపుకోలేక మెల్లిగా అడుగులు వేసుకుంటూ ఆగి దగ్గరకు వెళ్ళి చెవులు రిక్కించి వినడానికి వంగుంది. సంసార మాయాలోకంలో అప్పుడే తనకు అపశృతులు విన్పించబోతాయా? అనుకుంటూ!

"అవునూ! ముందుగదిలో ఎవరూ?" అన్నది మొగ కంఠం. ఏవో సంగతులు జరిగేక! "ఆ నా ఫ్రెండు! ఏదో బతుకు తెరువు కోసం వచ్చింది" అంది సుగుణ కంఠం.

"నీ మొగుడెప్పుడొస్తాడు?" ప్రశ్నించింది మళ్ళీ మొగ కంఠం. "ఇంకెక్కడ? బెజవాడ నుండి, ఉంచుకున్న ముండ కోసం జయపురం వెళ్ళి పదిరోజులైనా గడపడా?" అంది సుగుణ.

సగం అర్థం అయి, సగం అర్థం కాకుండా వుంది సీతకు. ఎవరీమొగాడు? ఖచ్చితంగా తమ పాత భాషలో వీణ్ణి "పేసింజర"నచ్చా? అయోమయంగా వుంది సీతకు.

"చూడు నీ ఫ్రెండుకీ ఒకణ్ణి లంకె తగుల్చు. ఈ సోఫాలూ, టీవీలేకాదు వీసీపీలు, వీసీయార్లు కొనొచ్చు" అన్నాడు. అది వ్యంగ్యమో, దెప్పిపొడుపో, సిన్సియర్ సలహాలో అర్థం కాలేదు సీతకి.

నిశ్చేష్టురాలై అలాగే నిలబడి, సుగుణ ఏం చెప్తుందా అని వింటోంది సీత!

"ఆ! నాకేల బాధ! మొగుడూరెళ్ళి ముండల మూకొర్రై నన్నెక్కడ ముంచెస్తున్నాడోనని భయపడి నిన్నుంచుకుంటే (?) ఏదో పెద్ద సంసారాలు ఇచ్చేస్తున్నట్లు సొల్లు కొడుతున్నావ్! సరసాలు చాలుగానీ, లైటార్పేయనా?" అంది సుగుణ.

మొట్టమొదటిసారిగా సీతకు సుగుణ అర్థమవసాగింది. దిక్కులేక తనా వ్యాపారం చేస్తే, దిక్కు కోసం సుగుణ ఈ వ్యాపారం నడుపుతోంది. అక్కణ్ణుంచి మరి విన్లేదు సీత! వాళ్ళ సరసాలు చూడాలనే ఉత్సాహం గానీ, ఉద్వేగం గానీ లేవు. ఎందుకంటే అవి తనకి జీవిత మార్గాలు ఒకప్పుడు. ఎంతో మంది విటులకు తను నేర్పింది. విటుల నుండి నేర్చుకుంది.

సుగుణ నాణెం రెండో వైపు సీత చూసి బాధ పడాలో, ఏడ్వాలో, ఇంకా గోల పెట్టాలో అర్థం కాలేదు.

పొద్దున్నే స్నానం చేసి వూరు చూస్తానని సీత కట్టుబట్టల్తో బయలుదేరింది. సుగుణ రాత్రి జరిగిన సంగతి ఏమాత్రం సీతకు తెలియదనే అనుకుంది. అలా అనుకోకపోతే సీత వెనక వద్దన్నా బలవంతంగా సుగుణ బయలుదేరేదేమో!

సీత నడుస్తోంది.' ఒక్కటే ఆలోచన ఎవర్ధు గొప్ప! ఈ సమాజంలో? కొత్త ఎస్సై, లారీ రంగయ్య, గుడిసె కనిపెట్టే రిక్షావాలా, అంతరంగాలు దాచుకున్న సుగుణ, కాకపోతే కుమారా? ఎవరు? లేకపోతే వీళ్ళందర్నీ మించిన తనా? గొప్పది? ప్చ్! ఏమో ఎవరు సమాధానం ఇస్తారు? అసలు దేనికి ఇస్తారు?

ఎదురుగుండా రైల్వే స్టేషన్ కనపడుతోంది పిల్లాడి వూసు జ్ఞప్తికి రావడం లేదు! రంగయ్య ఊసు కూడా! అసలు ఎవరి సంగతీ బుర్రలో లేదు. దేనికీ జీవితం! ఈ కుళ్ళు వ్యవస్థలో, కుతంత్రాల మనుషుల్తో ఎంత కాలం! రైల్వే పట్టాలంట తిన్నగా చాలా దూరం నడిచింది. నడుస్తూనే వుంది! తన జీవితంలా! రెండు పట్టాల సమాంతరాలు! ఒకటి తన జీవితం. ఒకటి తన అంతరంగం, రెండు ఎక్కడా కలవవు. కలిస్తే రైలునడవదు, నడవకూడదు! అలాగే నా జీవితం కూడా నడవదు. రెండు పట్టాలు కలిసే ఘడియ దగ్గిర పడుతోంది ఇప్పుడు.

తన రైల్లు కూలిపోయే ప్రమాద క్షణాలు దగ్గరౌతున్నాయి. వెనకనుండి దూసుకువస్తున్న రైలు శబ్దాలు సీతకు వినపడటం లేదు. విన్పించినా అవి తనకు కావు. రైలు దగ్గరయ్యింది. రైలు ఆగలేదు. కానీ సీత జీవితం ఆగింది?

ఏవీ తెలీని సూరీడు దేదీప్యంగా తూర్పు నుండి పశ్చిమానికి పరిగెడుతున్నాడు.

ప్రపంచం మామూలుగా నడుస్తోంది.

సీత చరిత్ర ఎవరికీ అక్కర్లేదు. కొంత మంది కొన్నాళ్ళు జ్ఞాపకం వుంచుకున్నారు. అది కూడా చరిత్ర మరుగున పడి పోతుంది. అందర్లాగే! అన్ని ఆడబతుకుల్లాగే.